

అక్రమ బదిలీలు వెంటనే ఆపాలి : యుటిఎఫ్

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వానికి దొడ్డిదారి బదిలీలపై ఉన్న ఆసక్తి సాధారణ బదిలీలపై లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సాధారణ ఉపాధ్యాయ బదిలీలు నిర్వహిస్తామని ఉపాధ్యాయ లోకాన్ని ఊరిస్తూ ఊరిస్తూ ప్రస్తుతం బదిలీలను ఆగమేఘాలపై నిర్వహించడం దుర్మార్గమని తెలిపారు. ఇలా ప్రభుత్వ బదిలీలు నిర్వహించడం వల్ల సాధారణ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. అక్రమ బదిలీలపై ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి సాధారణ బదిలీలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇలాగే ప్రభుత్వం మొండివైఖరితో వ్యవహరించి ముందుకు వెళితే భవిష్యత్తులో ఖచ్చితంగా ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే ఈ అక్రమ బదిలీలను ఆపుతూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'పచ్చబంగారం' ధర పలికేనా?



- పడిపోయిన ధరలు
- పెట్టుబడులు దక్కని వైనం
- పసుపు సాగుపై రైతుల్లో అనాసక్తి
- రిజిస్ట్రేషన్‌కే పరిమితమైన అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

పచ్చ బంగారంగా పేరొందిన పసుపును ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం చేతికిరాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంటల దిగుబడి, గిట్టుబాటు ధరలు పడిపోవడంతో రైతుల పరిస్థితి దిక్కుతోచని పరిస్థితికి మారింది. తాము పండించిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వానికి కోరుతున్నా ఫలితం శూన్యం. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పుకుంటున్న నాయకులు ఉపన్యాసాలు కేవలం మాటలకే పరిమితమవుతన్నాయి. నిజానికి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. జిల్లా వ్యాప్తంగా పసుపు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. పసుపు పంటపై మక్కువతో రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు సంక్షోభంలో కూరుకుపోతున్నారు.

పడిపోయిన ధరలు

పసుపు ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో భారీగా పడిపోయాయి. క్వింటా పసుపు రూ.ఐదు వేల వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వం మాత్రం పసుపు కొనుగులు చేయడంలో పూర్తిగా విఫలమైంది. గత ఏడాది మాత్రం కంటితుడుపుమ చర్యగా ప్రభుత్వం రూ.6,800 కొనుగోలు చేసింది. ఈ ఏడాది కొనుగోళ్ల ప్రస్తావనే తేవడం లేదు. రైతులు మాత్రం మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఎలాంటి తరుగులు లేకుండా రూ5,500 కొనుగోలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటు వ్యవసాయాన్ని వదులుకోలేక, అటు కూలీ చేయలేక మార్కెట్ ధర ఏడాదికేడాది పెరుగుతుందనే ఆశతోనే రైతులు పంటను సాగుకు పూనుకుంటున్నారు. రెక్కలు ముక్కలవుతున్నాయే తప్ప గిట్టుబాటు రేటు లభించడం లేదని రైతులు వాపోతున్నారు. క్వింటాకు ప్రభుత్వం రూ.10 వేలు చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

భారంగా పెట్టుబడులు

పసుపు రైతులకు పెట్టుబడులను నష్టపోనున్నారు. ప్రతి సంవత్సరం పంట సాగుకు పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. పసుపు విత్తనం నుంచి ఉడకపెట్టి గ్రేడింగ్ చేసేంతవరకూ ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. ఒక ఎకరాకు పసుపు విత్తనం ఏడు పుట్లు (ఒక పుట్టి 240 కిలోలు) అవసరం అవుతుంది. విత్తనమే సుమారు రూ.35 వేల వరకు అవుతుంది. దుక్కి, అచ్చు కట్టవేయుటకు, కలుపులకు, రసాయనిక ఎరువులు, తెలుగుళ్లకు మందులు, ఇతర ఖర్చులకు సుమారు రూ.45 వేలు ఖర్చవుతుంది. ఇవి కాకుండా అదనంగా మరో రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇలా ప్రతి ఏడాది ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. పసుపు పంట చేతికి రావాలంటే సుమారు తొమ్మిది నెలల కాలం పడుతుంది. అంత వరకు పంటకు ఖర్చు చేస్తూనే ఉండాలి.

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

ఉమ్మడి కడప జిల్లాలోని 21 మండలాల్లోనే పసుపును సాగు చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో పసుపు సాగు భారీగా తగ్గింది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతోంది. ఆయా మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఏ డాది మాత్రం కేవలం 5,600 ఎకరాలకే పరిమితమైంది. ఉదాహరణకు దువ్వూరు మండలంలో పసుపు సాగును గమనిస్తే 2018-2019లో 2500 ఎకరాల్లో సాగు చేశారు. 2019-2020లో 1800, 2020-2021లో 900, 2021-2022లో 550, 202223లో 533 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. పసుపు సాగు అత్యధికంగా ఖాజీపేట, దువ్వూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, కాశినాయన, సిద్దవటం, పుల్లంపేట, చాపాడు మండలాల్లోనే పసుపు సాగవుతుంది. ఈ ప్రాంతాల తర్వాత ఎక్కువగా చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట, రాజంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి మండలాల్లో సాగుచేస్తారు. బ్రహ్మంగారిమఠం, బి.కోడూరు, అట్లూరు, గోపవరం, నందలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో కొద్దిగా సాగు చేస్తారు. కాగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో పసుపు సాగుకు రైతులు అనాశక్తి చూపుతున్నారు.

అధికమవుతున్న సాగు ఖర్చులు



పసుపు పంట సాగుకు ఎకరాకు రూ.80 నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతున్నాయి. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నది. ప్రస్తుతం ఉన్న ధరలకు సాగు ఖర్చులు కూడా రావడం లేదు. రూ.10మ వేల వరకు పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది. ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం.

సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తున్నాం



స్థానికంగా వట్టి పసుపు సరైన ధరలు లేకపోవడంతో మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌కు పసుపు తరలించేందుకు సిద్ధపడుతున్నాం. సాంగ్లీ మార్కెట్లో ఎలాంటి షరతులు లేకుండా క్వింటా రూ.5500 ధర పలుకుతున్నది. గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో పసుపు పంటను సాగు చేసే వారం. ప్రతి ఏడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు మిగులుతున్నాయి. పసుపు పంట సాగు తగ్గించాం. పసుపు పంట ఏడాదిపాటు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉన్నది. గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగు తగ్గిస్తున్నాం.

- సురేష్, రైతు, చాపాడు.

మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలి

పసుపు పంటకు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలి. కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలి. జాతీయ స్థాయిలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి. పంట విస్తీర్ణంతో సంబంధంలేకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. పసుపు రైతులు ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టగా 25 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటాలు రూ.5 వేలకు మించి కొనుగోలుచేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. క్వింటాలు పసుపు రూ.10 వేలుకు కొనుగోలు చేయాలి.

- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం, కడప.

పేదింటి ఆడపిల్లకు పెళ్లి కానుక : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్

పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అపురూపమైన గొప్ప కానుకలు వైఎస్ఆర్ షాదీ తోఫా, కల్యాణమస్తు పథకాలు అని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అభివ ర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా పథకం రెండో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్‌త పాటు అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు హిదాయతుల్లా హాజర య్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం ఈ పథకానికి సంబంధించి వైఎస్ఆర్ జిల్లాలో గత ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుండి మార్చి 31 మధ్య కాలంలో వివాహం చేసుకున్న అర్హులైన 445 జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3,58,25,000 లను మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అతిధులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు, చదువును ప్రోత్స హించడం కోసం పదో తరగతి నిబంధనను అమలు చేస్తూ ఆడపిల్లల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏడాదిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ పథకానికి సంబంధించి అర్హులను ఎంపిక చేసి లబ్ధిదారులకు కల్యాణమస్తు, షాదీ తోఫాలను పెళ్లికుమార్తె తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు. అరులైన వారు పెళ్లి అయిన 60 రోజుల్లోపు http://gsws-nbm.ap.gov.in ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం అధికారులు దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలోనూ విచారించి అర్హుల జాబితాను ప్రకటిస్తారన్నారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ రామ్మోహన్ రెడ్డి, ఆయా సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధి పొందిన వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

కొద్ది రోజులుగా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజు భూషణ్‌ను అరెస్టు చేయాలని, తమకు న్యాయం చేయాలని దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న మోడీ ప్రభుత్వం తీరు దారుణమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో రేజ్లర్లపై దాడులను నిరసిస్తూ కడప యోగివేమన యునివర్సిటీ గేటు ముందు వేమన విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలాగా రెజ్లర్ల మహిళా క్రీడాకారులు బంగారు, కాంస్య పథకాలను ఒలంపిక్, టిక్కో ఒలంపిక్‌లో సాధిస్తుంటే వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, బిజెపి ఎంపీ కంచె చేను మేసినట్లు లైంగిక వేధింపులకు పాల్పడుతుం సిట్టు చేటన్నారు. కొద్ది రోజుల కిందట ఏడు గురు మహిళా రెజ్లర్ల క్రీడాకారులు సుప్రీం కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పం దించి చర్య తీసుకోవాలని ఆదేశించిందని చెప్పారు. ఐదు రోజులుగా రాత్రి, పగలు, ఎండ, వాన అనకుండా రెజ్లర్ల క్రీడాకారులు జంతర్‌మంతర్‌వద్ద ఆందోళన చేస్తుంటే దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజాసంఘాలు, ముఖ్యంగా మహిళ రైతు సంఘాలు, జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ మాలిక్ లాంటి మేధావులు మద్దతుగా నిలుస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు ఇనాయతుల్ల, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, పాములేటి, డివైఎఫ్ఐ నాయకులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

శిశు ఆధార్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - కడప

పుట్టిన వెంటనే ప్రతి శిశువుకు ఆధార్ నమోదు చేయించడంతో పాటు ఐదేళు పూర్తయిన వెంటఎ బయోమెట్రిక్ నమోదు చేయించాలని ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ఎస్ఐసి హాలులో సంబంధిత అధికారులతో కలిసి డిఆర్ఒ జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకూ 'శిశు ఆఫ్' ద్వారా తల్లిదండ్రుల ఆధార్ వివరాల ఆధారంగా తప్పనిసరిగా ఆధార్ నెంబర్ నమోదు చేయాలని సూచింఆరు. 5 సంవత్సరాల 4 నెలలు పూర్తి అయిన తర్వాత పిల్లల ఫింగర్ ప్రింట్ తో బయోమెట్రిక్ సీడింగ్ చేయించాలన్నారు. ప్రతి 10 సంవత్సరాలకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఆధార్ వివరాలు అప్ డేట్ చేయించాలన్నారు. ఆ దిశగా ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు, అన్ని పోస్టాఫీసులు, జిల్లాలోని 14 జాతీయ బ్యాంకుల్లో ఆధార్ నమోదు, అప్డేట్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారి ఆధార్ నమోదు, నవీకరణ వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాంశాలల్లో ఆధార్ ప్రక్రియ పూర్తికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ అప్డేట్ ఉచితంగా రెండుసార్లు చేయవచ్చని, విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. అవకాశం మార్చి 31 వరకు ఉంటుందన్నారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నంబరు1947 లేదా help@uidai.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ రాణి, జిఎస్ డబ్ల్యు అధికారి వెంకటసుబ్బయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివారెడ్డి పోస్టల్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గిన నేరాలు : ఎస్‌పి

కడప అర్బన్ : గత ఏడాది త్రైమాసికంతో పోలిస్తే జిల్లాలో మెరుగైన, మరింత సమర్థవంతమైన పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో నేరాలలో గణనీయమైన తగ్గుదల నమోదయినట్లు ఎస్‌పి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముమ్మరంగా గస్తీ నిర్వహించడంతో పాటు కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచడం వల్ల చోరీ కేసుల్లో భారీ తగ్గుదల నమోదయిందని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకూ కేవలం 59 కేసులు నమోదయ్యాయని, 47 శాతం తగ్గుదల నమోదయినట్లు పేర్కొన్నారు. శరీర ఘాత నేరాలకు సంబంధించి గత ఏడాది తొలి త్రైమాసికంలో 228 కేసులు నమోదు కాగా ఈ ఏడాది తొలి మూడు నెలల్లో 47 శాతం తగ్గి కేవలం 121 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ ఏడాది కేవలం 140 కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. మహిళా పోలీసులు తమ పరిధిలో ఎప్పటికప్పుడూ మహిళల సమస్యల గురించి తెలుసుకుంటూ సంబంధిత పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం వల్ల నేరాల నియంత్రణకు సహకరించిందని పేర్కొన్నారు.

సిఎం జగన్‌వి అబద్ధాలు, మోసాలే : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంకా ఎన్ని రోజులు అబద్ధాలు, మోసాలు చేస్తారని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ప్రశ్నించారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీకు జీతాలు, రిటైర్డ్ అయిన వారికి పెన్షన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రాలు మన రాష్ట్ర పరిపాలన చూసి నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. సూపర్ స్టార్ రజినీ కాంత్ ఎన్టీఆర్ శత దినోత్సవ ఉత్సవాలకు వచ్చి ఎన్టీఆర్‌కు అతనికి ఉన్న అనుబంధం గురించి నాలుగు మాటలు చెప్పారు. చంద్రబాబు నాయుడు గురించి చెపారని తెలిపారు. సమావేశంలో ఎల్. శివ శంకర్ రెడ్డి, అడ్వకేట్ జగన్మోహన్ రెడ్డి, నాదెళ్ల దస్తగిరి, డివిజన్ ఇన్చార్జులు బండి జయ శేఖర్, శ్రీనివాసులు, కుంట శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండా సుబ్బయ్య

తాలూకా పోలీసులపై చర్యలు తీసుకోవాలి

8న కలెక్టరేట్ వద్ద ఆందోళన
రౌండ్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

సిపిఐ, సిపిఎం నాయకుల పట్ల ఏప్రిల్ 29న కడప తాలుకా పోలీసులు వ్యవహరించిన అమానుష, దుర్చర్యలకు నిరసనగా ఈనెల 8న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్నట్లు అఖిలపక్ష నాయకులు గాలి చంద్ర, హరి ప్రసాద్, సత్తార్, డి.ఎం. ఓబులేసు, గుర్రప్ప, జి.వి.రమణ, అవ్వారు మల్లికార్జున, సిఆర్‌వి ప్రసాద్, రమణయ్య, శ్రీకృష్ణ, ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. సిపిఐ, సిపిఎం ప్రచారభేరి కార్యక్రమంలో పార్టీ నాయకుల పట్ల తాలూకా సి ఐ, ఎస్ఐలు వ్యవహరించిన తీరుకు నిరసనగా సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ అధ్యక్షతన శుక్రవారం ప్రెస్ క్లబ్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తరపున పోరాటాలు చేసే వారి సభలకు, సమావేశాలకు అనుమతులు ఇవ్వకపోగా వారి పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఈ మధ్యకాలంలో అభ్యంతరకరంగా ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గాంధీ విగ్రహానికి పూలదండ వేసేందుకు సైతం తాలుకా పోలీసుల అనుమతించకుండా అడ్డుకుని దుర్భాషలాడటం దారుణమన్నారు. విచక్షణారహితంగా సుబ్రహ్మణ్యంపై దాడి చేయడం, మైనుద్దీన్‌ను బండ బూతులు తిడుతూ బెదిరించడం, చంద్రశేఖర్‌ను అవమానకరంగా మాట్లాడిన సిఐ ఉలసయ్య, ఎస్ఐలు తాహిర్, రామకృష్ణను సస్పెండ్ చేయాలన్నారు. కమ్యూనిస్టులపై తాలూకా పోలీసుల అమానుష చర్యల పట్ల ఎస్‌పి, డిఎస్‌పిలకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు వారిపై చర్యలు లేకపోవడం దారుణమన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. తర్వాత జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు భవిష్యత్ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు, న్యాయవాదులు, ఐఎఎల్ నాయకులు సుబ్రహ్మణ్యం, జి.వి.రత్నం, అమీన్ పీరా, అఖిలపక్ష పార్టీల, ప్రజాసంఘాల నాయకులు బండి జకరయ్య, బాదుల్లా, బషీరున్నీసా, చంద్రశేఖర్, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, గంగా సురేష్, వలరాజు, బ్రహ్మం, ఓబయ్య, శివ నాగేంద్ర, మురళి, శివ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కలసపాడు : మండలంలోని రామాపురం గ్రామంలో అంకాలమ్మ తిరుణాల సందర్భంగా శుక్రవారం బండలాగుడు బండలాగుడు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాశినాయన మండల వైసిపి కన్వీనర్ విశ్వనాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహి ంచుకోవడం ఆనవాయితీ అన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు ఆనందంగా సంబరాలు చేసుకుంటారన్నారు. ఇందులో భాగంగా బండ లాగడు పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన ఎడ్ల యజ మానులకు నిర్వాహకులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

కడప అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్స్ పోస్ట్ భర్తీ కోసం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరీక్షల శనివారం నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్ఒ నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉందని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్




మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్రంలో పాంశాలల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్క రించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లయన్ ఇమామ్ బాషా కోరారు. శుక్రవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇమాం బాషా మాట్లాడుతూ పాఠశాల విద్య- ఉర్దూ పాఠశాలల విద్య - బదిలీలు, ప్రమో షన్లు, ఉర్దూ పాఠశాలల, ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారికి బదిలీలు ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచితాలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న చెప్పలి పుల్లయ్య

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఒక కర్ణాటక రాష్ట్రానికి మాత్రం సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెబుతున్నారు, మరి మిగతా రాష్ట్రంలో ఎందుకు ఇవ్వడంలేదని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పలి పుల్లయ్య మాట్లాడారు. రోజుకు అర లీటర్ పాలు ఉచితంగా ఇస్తామన్నారు, మిగతా రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో సమధానం చెప్పాలన్నారు. నరేంద్ర మోడీ దేశం మొత్తం తిరిగి ఉచితాలకు స్వస్తి పలకాలని పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల ప్రచారం చేస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల బిజెపి నాయకులు మన రాష్ట్రాల్లో కూడా ఉచిత సిలిండర్లు ఎందుకివ్వలేదో మోడీని ప్రశ్నించాలన్నారు. మోడీ మీరు ఎన్ని ఉచితాలు ఇచ్చినా 40 శాతం కమీషన్ ముద్రను కర్ణాటకలో చెరపలేరని గుర్తుపెట్టుకోండి అన్నారు కర్ణాటకలో ఉచితాలకు తెరలేపడం చూస్తే మోడీకి ఓటమి భయం పట్టుకుందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉచిత సిలిండర్లు ఎందుకు ఇవ్వడం లేదో బిజెపికి వత్తాసు పలికే వైసీపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో కార్మిక విభాగం కమలాపురం అధ్యక్షుడు అశోక్, ఎన్ ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పట్టణంలో అంబేద్కర్ భవనంలో బుద్ధ జయంతిని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, కడప విభాగం వారు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఇళ్ల రామసుబ్బయ్య మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవాళి సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరివీధి జయరామ్, ఆర్. పాపయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, కె. రాజమ్మ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

పెండ్లిమర్రి : ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరడంలో వాలంటీర్ల వ్యవస్తే అత్యంత కీలకమని, వాటిపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 246 మంది వాలంటీర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థ దేశంలోనే మన రాష్ట్రం ఏర్పాటుచేసిన గొప్ప వ్యవస్థ అని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సకాలంలో అవసరమైన సేవలు అందించడంలో ఎప్పటికప్పుడూ వాలంటీర్లు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆరోగ్య కార్డులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ప్రజలకు అవసరమైన సేవలు అన్ని వాలంటీర్ల ద్వారా అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. మండల అభివృద్ధి అధికారి ఆల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ వాలంటీర్లందరూ వారంలో మూడు రోజులు సోమ, బుధ, శుక్రవారాల్లో తప్పకుండా బయోమెట్రిక్ హాజు నమోదు చేయాలని, ప్రజలకు ఎప్పటికప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విజయభాను, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపిలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

- 8 మందికి గాయాలు

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని గంగనపల్లి గ్రామపంచాయతీలో వైసిపికి చెందిన రెండు గ్రూపుల వారు శుక్రవారం ఉదయం ఘర్షణ పడ్డారు. కర్రలతో, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఇందులో ఇరు గ్రూపులకు చెందిన ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వారిని సర్దిజెప్పారు. అనంతరం ఇరు గ్రూపుల వారు పోలీసు స్టేషన్‌లో ఒకరిపై నొకరు ఫిర్యాదు చేసుకున్నారు. రాములవారి రుసుం విషయంలో గొడవ చోటుచేసుకున్నటుల స్థానికులు పేర్కొంటున్నారు. ఏడాది నుంచి వైసిపికి చెందిన రెండు గ్రూపుల మధ్య విభేదాలు చాపకింద నీరులా కొనసాగాయి. ఇటీవల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సైతం ఎంపిపి, జడ్‌పిటిసిలు హాజరు కాకపోవడం ఇందుకు నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇరుగ్రూపుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బౌద్ధారామాలు విలువైన జాతి సంపద

ప్రజాశక్తి - కడప అర్బన్

నందలూరులోని అడపూరు వద్దగల బౌద్ధారామాలు మన ప్రాంతానికి అత్యంత విలువైన జాతి సంపద అని భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ మానస చిన్నపరెడ్డి అన్నారు. శుక్రవారం బుద్ధ జయంతిని పురస్కరించుకుని ఇంటాక్ సభ్యులు బౌద్ధారామాలను సందర్శించారు. ప్రొద్దుటూరు సర్కిల్-1 జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్ కార్యాలయం నుంచి జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. సంస్థ పూర్వ కన్వీనర్ ఎలియాస్ రెడ్డి, సభ్యులు కొండారెడ్డి, లయన్లు జోజిరెడ్డి, సంజీవరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, కోటేశ్వరరావు, గంగాధర్ తదితర సభ్యులతో కూడిన బృందం అడపూరు బౌద్ధారామాల సందర్శనకు వెళ్లారు. అనంతరం ఆరామాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి మానవహారంగా ఏర్పడి బౌద్ధమంత్రం ఆలపించారు.

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం. సురేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఈ నెల 9 నుంచి 25 వరకు www.cse.ap.gov.in/apms.ap.gov.in లో దరఖాస్తు చేసుకో వాలని ఆయన పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం పాఠశాల వద్ద సంప్రదించాలని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 11న పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

బ్రాహ్మణపల్లిలో ఘనంగా మొలకల పౌర్ణమి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో శుక్రవారం మొలకల పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కుండలో నవధాన్యాలను పోసి 11 రోజులపాటు ఆ వాటిల్లో నీళ్లు పోస్తారు. 11వ రోజు మొలకల పౌర్ణమి సందర్భంగా పెద్దలు, పిల్లలు ఆ కుండలను తలపై పెట్టుకుని కుల, మతాల కతీతంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో మొలకల పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తారు. మహిళలు కుండలను తలపై పెట్టుకుని వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద, గంగమ్మ, పెద్దమ్మ, రాఘవేంద్ర స్వామి గుడి, సాయిబాబా స్వామి గుడి వద్ద మొలకల కుండీలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొలకల చుట్టూ మహిళలు తిరుగుతూ పాటలు పాడారు. పాడిపంటలతో గ్రామం కళకళలాడుతూ ఉండాలని మహిళలు 11 రోజులపాటు ఈ మొలకలకు ప్రత్యేకశ్రద్ధతో చూసుకుంటూ పౌర్ణమి రోజు వేడుక నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.


మొలకలు ఎత్తుకొని వెళుతున్న మహిళలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం వైసిపి నాయకుడు కసిరెడ్డి ఇంద్రసేనారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నగేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచు రాచినేని శ్రీనివాసులు ప్రారంభించారు. ఇంద్రసేనారెడ్డి వర్ధంతి రోజు అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరమని రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. వైసిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, భూషణం, బ్రహ్మానంద కుమార్, బాబు, సునిల్, దివాకర్, నాగేంద్ర, ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సర్పంచు రాచినేని శ్రీనివాసులు

సహోద్యోగికి పోలీసుల నివాళి

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని కె.వెంకటాపురం గ్రామానికి చెందిన జి.సిద్ధప్ప, పక్కీరమ్మ కుమారుడు జి.రహీంబాబు(53) మృతికి తోటి పోలీసులు ఘన నివాళులర్పించారు. రహీంబాబు 1992లో ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం నందలూరు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రహీంబాబు గురువారం గుండెపోటుకు గురికావడంతో కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు. రహీంబాబు అంత్యక్రియలు శుక్రవారం కొండాపురం మండలం కె.వెంకటాపురంలో నిర్వహించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

రహీంబాబు తోటి ఉద్యోగులు 1992 బ్యాచ్ చెందిన వారు, స్నేహితులు శుక్రవారం వెంకటాపురం గ్రామానికి వచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు.

మంత్రిగారూ.. ఆస్పత్రి సమస్యలు తీర్చండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మాట్లాడుతున్న శివజ్యోతి

ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వాటిని పరిష్కరిం చండని టిడిపికి చెందిన 33వ వార్డు కౌన్సిలర్ జి.శివజ్యోతి కోరారు. ప్రొద్దుటూరు నియోజక వర్గంతోపాటు పక్కనున్న రెండు నియోజకవర్గాల పేదలు పలు కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్ట ణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రారంభించేందుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మున్సిపల్ శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం ప్రొద్దు టూరుకు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శుక్రవారం మాట్లాడుతూ మంత్రితోపాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కూడా స్పందించాలన్నారు. ఈ ఆసుపత్రిలో గైనకాలజిస్టు కొరత కొన్నేళ్లుగా పీడిస్తోం దన్నారు. పేద మహిళలు కాన్పు కోసం ప్రభుత్వాసుపత్రికి వెళితే డాక్టర్లు లేరని వెనక్కి పంపిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి పోతే ఆరోగ్యశ్రీ కింద కాన్పులు చేసే పరిస్థితి లేక ఎటూ తేల్చుకోలేక పేదలు నానాయాతన పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో న్యూరోఫిజీషియన్, కార్డియాలజిస్టు డాక్టర్లు లేకపోవడంతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు రోగులు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. పేదలు అంతంత దూరాలు వెళ్లలేక నాటు వైద్యంతో సరిపెట్టుకుంటూ మృత్యువాత పడుతున్న సంఘటనలు లేకపోలేదన్నారు. గర్భాశయ ఆపరేషన్లను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని జి.శివజ్యోతి తెలిపారు.

నీటి పొదుపు పాటించండి : కమిషనర్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ ప్రజలు తాగునీటి వృథాను అరికట్టి, పొదుపును పాటించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణానికి ప్రస్తుతం రామాంజనేయపురం, పొట్లదుర్తి, కమలాపురం పంపింగ్ స్టేషన్ల నుంచి పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. సదరు పైప్‌లైన్ వేసి చాలా కాలమైనందున తరచూ మరమ్మత్తులతో ఎక్కడా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతన కుళాయి కనెక్షన్లు కూడా నిలిపి వేశామని, నీటిని వృథా చేయకుండా పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


స్థల ఆక్రమణకు యత్నిస్తున్నారని ఆరోపణ

ఎర్రగుంట్ల : తన స్థలాన్ని గ్రామ సర్పంచు, మాజీ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు అంబటి కృష్ణారెడ్డి ఆక్రమించుటకు ప్రయత్నిస్తున్నాడని మండల పరిధిలోని తిప్పలూరు గ్రామానికి చెందిన పేర్ల శ్రీనివాసులరెడ్డి ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. తిప్పలూరు గ్రామ కంఠానికి సంబంధించిన స్థలాన్ని దాదాపు 70, 80 సంవత్సరాల నుండి పీర్ల నడిపి సుబ్బిరెడ్డి సర్వేనెంబర్ 194లో రెండున్నర సెంట్లు అనుభవంలో ఉంది. ఈ స్థలాన్ని 2020లో తన కుమారుడైన పేర్ల శ్రీని వాసులరెడ్డికి ప్రభుత్వ అనుమతితో రిజిస్టర్ చేయడం జరిగింది. ఈ స్థలానికి సమీపంలో సచివాలయ సముదాయాన్ని నిర్మించారు. సర్వేనెంబర్ 194లోని రెండున్నర సెంట్ల స్థలాన్ని కూడా సచివాలయంలో కలపాలని తమ కుటుంబాన్ని బెదిరించినట్లు బాధితులు శ్రీనివాసులరెడ్డి ఆరోపిస్తున్నాడు. తన స్థలంలో మట్టిని తోలుకొని చదును చేసుకుంటుంటే అంబటి కృష్ణారెడ్డి తన మనుషులతో వచ్చి జెసిబి సహాయంతో స్థలంలోని మట్టిని పక్కకు నెట్టి, స్థలంలో గుంతలు తవ్వారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంకోసారి స్థలంలో అడుగుపెడితే చంపేస్తానంటూ బెదిరించాడని బాధితులు ఆరోపించారు. ఆ మేరకు ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.


స్థలం పత్రాలు చూపుతున్న కుటుంబ సభ్యులు

రెండు నెలలుగా కనిపించని వృద్ధుడు

ఖాజీపేట : మండలంలోని శాంతి నగరం గ్రామానికి చెందిన చిట్టెపు వెంకటేశ్వర్‌రెడ్డి (68) రెండు నెల లుగా కనిపించడంలేదని ఎస్ఐ కుళ్లాయప్ప శుక్రవారం తెలిపారు. ఆ మేరక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశార న్నారు. ఆచూకీ తెలిసిన వారు 91211 00623 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు.


వెంకటేశ్వర్‌రెడ్డి

ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లకు మంగళమేనా..?

అలంకారప్రాయంగా మారిన వైనం - అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు తూట్లు

ప్రజాశక్తి -జమ్మలమడుగు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అవసర సమయాల్లో ప్రయాణికులకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ (ప్రథమ చికిత్స పెట్టె) ను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం వాటి నిర్వహణకు మంగళం పాడినట్లుందనే విమర్శలున్నాయి. ఆర్‌టిసి బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు కేవలం అలంకారప్రాయంగా మారాయి. బస్సులు కొనుగోలు సమయంలో ఫస్ట్ ఎయిడ్‌కు సంబంధించి పరికరాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆ కంపెనీ వారే తీసుకుంటారు. దీని ముఖ ఉద్దేశ్యం అత్యవసర సమయాల్లో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు, చిన్నపాటి గాయాలైనప్పుడు ఈ ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను వినియోగిస్తారు. అందులో వైద్య పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. మోటార్ బైక్ నుండి భారీ వాహనాల వరకు ఫస్ట్ ఎయిడ్‌కు సంబంధించిన అన్ని వాహనాల్లో ఉం టాయి. ప్రధానంగా ఆర్‌టిసి బస్సులో డ్రైవర్ వెనకాలే ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను ఏర్పాటు చేస్తారు. అయితే కొంత కాలంగా బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అలంకార ప్రాయంగా మారింది. ఆర్‌టిసి యాజమాన్యం ఖర్చులను తగ్గిం చడంలో భాగంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లకు పూర్తిస్థాయిలో మంగళం పలికి నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన నిధులు ఏమయ్యాయో కూడా అర్థం కాని విషయం. ఆర్‌టిసి బస్సులో ఫస్ట్ ఎయిడ్ పరికరాలు ఏర్పా టుకు రూ.500 లేదా రూ.1000 ఖర్చు అవుతోంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికుల బాగోగులను పట్టించుకోకుండా యాజమాన్యం ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను అలంకారప్రాయంగా మార్చిందనే విమర్శలున్నాయి. ఏ ఆర్‌టిసి బస్సులో చూసినా పెద్ద ఎరుపు అక్షరాలతో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కనిపిస్తాం టుంది. ఆ బాక్స్‌లను తెరిచి చూస్తే ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆపద సమ యాల్లో ప్రథమ చికిత్సకు ఉపయోగపడే వీటిని ఎందుకు నిర్లక్ష్యం చేస్తు న్నా రని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌక ర్యం అంటూ ప్రకటనలే తప్ప ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపిస్తోంది. సంస్థకు ఖర్చు తగ్గినప్పటికీ ఏదైనా జరిగితే ఉప యో గపడే ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో లేకపోతే ఎలా అని ప్రయా ణికు డు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరు తున్నారు.



ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్

నీటి కోసం పడిగాపులు.. ఫోన్ చేసినా పలకని సిబ్బంది

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాఘ్ని నదిలో నీరు పుష్కలంగా ఉన్నా.. నీటి కోసం మహిళలు పడి గాపులు కాస్తున్నారు. నీటి కోసం మహిళలు ఫోన్ చేసినా నీటి సరఫరా చేసే సిబ్బంది పలకకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పుల్లయ్య తోటలో సక్రమంగా నీటి సరఫరా కావడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయిదు రోజులుగా తాగునీరు సరఫరా కాలేదు. బోరు నీటిని కూడా సరఫరా చేయడం లేదని స్థానికులు విజయ, జయమ్మ, వరలక్ష్మితోపాటు పలువురు మహిళలు వాపోయారు. పుల్లయ్యతోట ప్రాంతానికి నీటి సరఫరా ఎప్పుడు అవుతుందోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని మహిళాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగ పూట కూడా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళాలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నీటి కోసం సమీపంలోని రైస్ మిషన్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తోందంటున్నారు. నీరు కూడా ఎక్కువ సేపు సరఫరా చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారినట్లు అవేదన వ్యక్తం చేస్తు న్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పుల్లయ్య తోట ప్రాంత ప్రజలకు నీటి ఇబ్బందులు తొలగించాలని మహిళలు కోరుతున్నారు.


తాగునీరులేదని ఖాళీ బిందెలు చూపిస్తున్న మహిళలు

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


నియామక పత్రాలు అందజేస్తున్న జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగులు తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో గతంలో అనేక కారణాలతో మృతి చెందిన నలుగురు జిల్లా పరిషత్ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 120 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి చొరవతోనే ఎన్.సుష్మ, పి.పరిమిళలకు జూనియర్ అసిస్టెంట్లుగా.. కె.రెడ్డెమ్మ, ఎస్.మహ్మద్ ఆర్షియాలను ఒఎస్‌లుగా నియమిస్తూ కారణ్య నియామక పత్రాలను అందజేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమర్థత వల్లే జిల్లా ప్రగతి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ పరిధిలోనికి వచ్చే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను చిత్తశుద్ధిగా అమలు చేసి, మంచి పేరు తేవాలన్నారు. అప్పుడే కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు కృతజ్ఞత తెలిపే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకటరమణారెడ్డి, ట్రెజర్ రంగాచార్యులు, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

నివేదిక పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ / ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల జాబితాపై యుద్ధ ప్రాతిపదికన నివేదికలు అందించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పులివెందులలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంట వివరాలను రూపొందించుటకు జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టానికి గురైన రైతుల వివరాలను సేకరించాలని, అందుకు సంబంధించిన జాబితాను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలనలో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని చెన్నమారాజుపల్లె గ్రామంలో నష్టపోయిన వరి పంట పొలాలను జిల్లా స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, జెసి గణేష్‌కుమార్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ వెంకటేష్, సిపిఒ వెంకట్‌రావు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.


చెన్నమరాజులపల్లెలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కంప చెట్లను తొలగించరూ..!


రోడ్డును పూర్తిగా ఆక్రమిస్తున్న కంపచెట్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయం ఎదురుగా ఉన్న మసీదు వీధిలోని ప్రజల రాకపోకలకు అడ్డుగా పెరిగిన కంపచెట్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కంపచెట్లు ఏపుగా పెరుగుతూ రోడ్డును ఆక్రమిస్తున్నాయి. ఈ దారుల్లో వెళ్లాలంటే వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు, ప్రజలు పెరిగిన కంపచెట్లు తమ కళ్లకు తగిలే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో కంప చెట్లు పెరగడం ద్వారా అవి రోడ్డును ఆక్రమిస్తున్నాయని, మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్న కంపచెట్లను మున్సిపల్ అధికారులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


రాకపోకలకు అసౌకర్యంగా ఉన్న కంపచెట్లు

జిఒ-1 అప్రజాస్వామికం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రహదారుల మీద ర్యాలీలను నిషేధిస్తూ వైసిపి ప్రభుత్వం జనవరి 2న జారీ చేసిన జిఒ నంబర్ వన్ అప్రజాస్వామికమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిఒ వన్‌ను కఠినంగా అమలు చేయాలని సిఎం జగన్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించడం శోచనీయమన్నారు. భారత రాజ్యాంగం 19వ అధికరణ ద్వారా పౌరునికి ప్రసా దించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు ఇది విఘాతమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు గొంతెత్తకుండా చేసే కుట్ర అన్నారు. ఎన్టీఆర్ చైతన్య యాత్ర, వైఎస్ఆర్, చంద్రబాబు, జగన్ పాదయాత్రలు రహదారుల మీదే చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ జిఒకు సంబంధించి హైకోర్టు తీర్పు రిజర్వులో ఉండగా, సిఎం ఇలాంటి ఆదేశాలివ్వడాన్ని తప్పుపట్టారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎటిఎం ప్రసాద్‌ను తులసిరెడ్డి ఆయన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు.

12న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ముద్దనూరు : వేసవి సెలవులు సందర్భంగా స్థానిక బాయ్స్ హై స్కూల్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 12న జిల్లాస్థాయి హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్న మెంట్ నిర్వహించనున్నట్లు శుక్రవారం నిర్వా హకులు సుమంత్ యాదవ్, అశోక్, రాము తెలి పారు. ముద్దనూరు-జమ్మలమడుగు రహదారి లోని జగనన్న కాలనీ సమీపాన ఉన్న మైదానంలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ప్రవేశ రుసుం రూ.1,500 చెల్లించాల్సి ఉంద న్నారు. జట్టు పేరు నమోదు ప్రక్రియ ప్రారంభమైం దన్నారు. తుది నిర్ణయం నిర్వాహ కుల దేనన్నారు. ఒక జట్టులో ఆడిన అటగాడు వేరే జట్టులో ఆడ కూడదన్నారు. వివరాలకు 99480 51605, 93471 13240 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట


మండలంలోని సుంకేసుల గ్రామంలో మొలకల పౌర్ణమి సందర్భంగా శ్రీ వీరాంజనేయ స్వామి తిరుణాల సందర్భంగా శుక్రవారం ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజ నేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరాం జనేయ స్వామి మూల విరాట్‌ను ప్రత్యేక పూలతో అలం కరించారు. పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. వైసిపి మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చంద్రభాస్కర్‌రెడ్డి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న డి.గంగాధర్‌రెడ్డి

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

అరవై ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు ఎంఎస్ తేజ సూచించారు. చాపాడు సచివాలయంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 73 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కొందరికి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచిత కంటి అద్దాలతోపాటు శస్త్ర చికిత్సలు(శుక్లమ్ ఆపరేషన్లు) నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం స్రవంతి, ఆశాలు పెర్సీ, కులాయమ్మ, జ్యోతి, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నరు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు ఎంఎస్ తేజ

'ఆ ఉపాధ్యాయుడు మాకొద్దు'పై విచారణ

ప్రజాశక్తి - కొండాపురం

పట్టణంలోని రామసుబ్బారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జయరాజు ఉపాధ్యాయుడిపై గతంలో వచ్చిన ఆరోపణల మేరకు జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం పాఠశాలలో విచారించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులను ఎంఇఒ పిలిపించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 'ఆ సార్ వస్తే మేము బడికి రాం'.. 'మా పిల్లలను బడికి పంపం' అంటూ తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు. ఆయన పనితీరు సక్రమంగా లేకపోవడం వలన విద్యార్థుల భవిష్యత్ కుంటుపడే ప్రమాదం ఉందని, వచ్చే విద్యా సంవత్సరంలోనైనా ఇక్కడికి కొత్త ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని పాఠశాల కమిటీ సభ్యులు సూచించారు. విచారణలో జయరాజు ఉపాధ్యాయుడిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో చాపాడు ఎంఇఒ ఎం.రవి, కొండాపురం ఎంఇఒ ఓబులేసు, సిఆర్‌పి సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, జయశేఖర్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ప్రొద్దుటూరుకు పురపాలక శాఖ మంత్రి రాక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణంలోని పలు అభివృద్ధి కార్యాక్రమాలను సందర్శించి, ప్రారంభించేదుకు జిల్లా ఇన్‌ఛార్జి ,పురపాలక శాఖామాత్యులు ఆదిమూలపు సురేష్ శనివారం ప్రొద్దుటూకు విచ్చేయనున్నారు. అధికారిక సమాచారం మేరకు ఉదయం 10.15గంటలకు రూ.76.10లక్షలు వ్యయంతో నిర్మితమైన థర్డ్ కాలనీని ప్రారంభిస్తారు. ఉదయం 10.35గంటలకు శివాలయం సెంటర్‌లో రూ.50కోట్లతో నిర్మించనున్న కూరగాయల మార్కెట్ ఆధునీకరణ పనులను సందర్శిస్తారు. అనంతరం శ్రీరాములపేటలో రూ.కోటి వ్యయంతో నిర్మితమైన పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తారు. రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్‌లో అమృత్‌పథకం కింద రూ.120 కోట్లతో జరుగుతున్న పనులను సందర్శిస్తారు. అలాగే రూ.3.50కోట్ల వ్యయంతో గాంధీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అనంతరం 11.45గంటలకు విలేకరుల సమావేశం ఉంటుంది. మధ్యాహ్నం 12.30గంటలకు గవిని సర్కిల్ నుండి బైపాస్ రోడ్డు వరకు ఇరువైపులా విస్తరణ పనులు, కాలువల నిర్మాణం, డివైడర్స్, సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

ప్రచార ఆర్భాటం కోసమే జగనన్న కాలనీలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రచార ఆర్భాటం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీలు చేశాడని, కట్టడానికి కాదని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కోవెలకుంట్ల బైపాస్ రోడ్డు దగ్గర శివారెడ్డి కాలనీలో శుక్రవారం ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన కాలనీలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కరపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వైసిపి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 40 నెలలు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం సున్నా అన్నారు. వసతులు లేని ఎన్నో కాలనీలను ఏర్పాటు చేస్తూ నిర్మాణం చేయకుండా ఉన్నాయన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికిరాగా అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, రాయల్ కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ రాయల్, బాల పుల్లారెడ్డి, బాలకృష్ణ, గోపాల్, మల్లేష్, సాయి, జ్యోతిశ్వరయ్య, శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, నెల్సన్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందజేస్తున్న భూపేష్‌రెడ్డి